

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 320 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 22, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# ఆంధ్ర ప్రభుత్వానికి.. సుప్రీం షాక్ !

- ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టిన సుప్రీంకోర్టు
- దాడులను ఎన్నికల ఆగడాలను నియంత్రిస్తూ తీర్పునిచ్చింది
- పోటీలో పాల్గొనే అభ్యర్థులను రక్తాలు కారేలా కొట్టించిన కూటమి ప్రభుత్వం
- ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులను చూసి సభ్య సమాజం సిగ్గుపడుతుంది
- మరో మణిపూర్ రాష్ట్రాన్ని తలపించిన ఆంధ్రప్రభుత్వం
- స్వతంత్రంగా నామినేషన్ వేసుకునుటకు సుప్రీం అంగీకారం
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దాడులపై భగ్గుమంటున్న ప్రజలు
- నామినేషన్లు తిరస్కరణ అభ్యర్థుల బాండోవర్లు అప్రజాస్వామికం
- వైసిపి నేతలపై దాడులకు ఎగబడుతున్న కూటమినేతలు
- పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- డాక్టర్ బరిగెల శివ

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారంటూ వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నామినేషన్ పత్రాల చింపివేత, దాడులు, బెదిరింపులపై ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో హింసకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామాలపై స్పందించిన డాక్టర్ బరిగెల శివ కూటమి ప్రభుత్వ తీరును విమర్శించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు స్వేచ్ఛగా నామినేషన్లు వేసుకునే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. పోలీసులు, ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు సమాన అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, అభ్యర్థుల భద్రత ప్రాధాన్యాన్ని మరోసారి చర్చకు తెచ్చాయి. ఎన్నికల ప్రక్రియలో ఎదురైన అడ్డంకులకు పరిష్కారం చూపి, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే కీలకమని డాక్టర్ బరిగెల శివ అభిప్రాయపడ్డారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2





డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## తెలంగాణకు బీసీ సీఎం.. ఇప్పుడే కాదు

- బీసీ సీఎం కావడానికి గడువు లేదన్న మహేశ్ గౌడ్
- కాంగ్రెస్‌తోనే బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య
- 2039 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా
- రేవంత్ పాలనపై టీపీసీసీ చీఫ్ ప్రశంసలు
- బీఆర్ఎస్‌పై ప్రశ్నలు.. బీజేపీకి భవిష్యత్తు లేదని వ్యాఖ్య

4





## 2028 నాటికి పోలీసు ఖాళీలన్నీ భర్తీ

- పోలీసు శాఖలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు
- అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండ
- వీరమరణం పొందిన పోలీసులకు భారీ పరిహారం
- సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుకు సీఎం పిలుపు

2

## మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

2



## అంతర్జాతీయ వేదికపై యువ పరిశోధకుడి సత్తా!

- తిరుమలాయపల్లి యువకుడు వశపాక అనిల్‌కు ప్రథమ బహుమతి
- ప్రపంచ జీర్ణకోశ వ్యాధుల సదస్సులో గుర్తింపు
- క్యాన్సర్ పరిశోధనల్లో కీలకంగా కృషి.. అనిల్‌కు ప్రముఖుల అభినందనల వెల్లువ
- గ్రామ యువతకు స్ఫూర్తిగా నిలిచిన విజయం

2

## అంతర్జాతీయ స్థాయిలో మన ఊరి బిడ్డ ప్రతిభ..

యువ పరిశోధకుడు అనిల్ కుమార్‌కు డా. బరిగెల శివ ఘన సన్మానం



జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# 2028 నాటికి పోలీసు ఖాళీలన్నీ భర్తీ

**పోలీసు శాఖలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు**
**అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండ**
**వీరమరణం పొందిన పోలీసులకు భారీ పరిహారం**
**సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు**
**ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుకు సీఎం పిలుపు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



విడతలవారీగా నియామకాలు చేపడుతూ 2028 నాటికి పోలీసు శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేసి సిబ్బంది కొరత లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ, వారి ఆశయాలను కొనసాగిస్తూ శాంతియుతమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమరులకు నివాళులర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ, శాంతిభద్రతల ప్రాధాన్యత, పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ఎంతో భావోద్వేగమైన రోజని, సమాజం కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరుల సేవలను మరువలేమని పేర్కొన్నారు. అమరుల కుటుంబాలు ఒంటరి కావని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది విధి నిర్వహణలో 154 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేస్తూ, వారి త్యాగాలను ఎప్పటికీ మరిచిపోలేమని, వారందరికీ హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నానని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. ప్రాణత్యాగం చేసిన వారి కుటుంబాల బాధలను పూర్తిగా తీర్చలేకపోవచ్చని, కానీ వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పిల్లల చదువు, భద్రత విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని, మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే పెట్టుబడులు ఒక్కటే సరిపోవని, రోడ్లు, భవనాలు నిర్మిస్తేనే అభివృద్ధి కాదని, ప్రజలు నిర్భయంగా జీవించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమలు రావాలన్నా, పెట్టుబడులు పెరగాలన్నా, ఐటీ, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందాలన్నా శాంతిభద్రతల పరిరక్షణ ఎంతో ముఖ్యమని, అందుకే ప్రజా ప్రభుత్వం పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. పోలీసు శాఖను బలోపేతం చేయడానికి 2025 అక్టోబర్ నాటికే దాదాపు 16 వేల మంది కానిస్టేబుళ్లు, ఎస్ఐలను నియమించామని, సిబ్బంది కొరతను తగ్గించడానికి కొత్త నియామకాలు చేపడుతున్నామని, 2026లో పోలీసు శాఖలో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి అనుమతించామని వెల్లడించారు. విడతలవారీగా నియామకాలు చేపట్టి 2028లోగా పోలీసు శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేసి సిబ్బంది కొరత లేకుండా చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని, దేశంలో ఎక్కడా లేని విధంగా ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మగౌరవాన్ని పెంచామని చెప్పారు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన కానిస్టేబుళ్లకు గతంలో రూ.40 లక్షలుగా ఉన్న ఎక్స్‌గ్రేషియాను రూ.కోటికి పెంచామని, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు గతంలో రూ.45 లక్షలుగా ఉన్న పరిహారాన్ని రూ.కోటికి పెంచామని తెలిపారు. ఎస్ఐలకు రూ.45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 లక్షలుగా ఉన్న పరిహారాన్ని రూ.1.25 కోట్లకు పెంచామని, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారులకు గతంలో రూ.50 లక్షలుగా ఉన్న పరిహారాన్ని రూ.1.50 కోట్లకు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.కోటిగా ఉన్న పరిహారాన్ని రూ.2 కోట్లకు పెంచామని వివరించారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని, వారికి మరింత ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు వారి త్యాగాలను గుర్తించి కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అమరుల కుటుంబాల్లో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు ఇంటి స్థలం, ఉచిత విద్య, వైద్య సహాయం అందిస్తున్నామని, వైద్య విద్యలో ప్రత్యేక సీట్లను అమలు చేస్తున్నామని తెలిపారు. భద్రతా సంక్షేమ నిధి నుంచి రూ.16 లక్షలు, సంక్షేమ నిధి నుంచి మరో రూ.8 లక్షలు అందించాలని నిర్ణయించామని చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నామని, దీనిని రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నానని తెలిపారు. హోంగార్డుల వైద్య పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని, హోదా ఏదైనా ప్రతి ఒక్కరి కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందని అన్నారు. పోలీసు శాఖలో హోంగార్డు స్థాయి నుంచి డీజీపీ స్థాయి వరకు సిబ్బంది పిల్లలు చదువుకోవడానికి రంగారెడ్డి జిల్లా మంచిరేవుల ప్రాంతంలో 44 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించామని వివరించారు. డ్రగ్స్, గంజాయి వ్యాప్తి అత్యంత ప్రమాదకరంగా మారుతోందని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ పనితీరును, డీజీపీని అభినందించారు. కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు కొత్తగా టీజీ సేఫ్ ను ప్రారంభించామని, షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మహిళల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మహిళలకు అండగా నిలవాలనే సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఈ ఏడాది మార్చిలో కార్యక్రమాన్ని ప్రారంభించామని, మహిళలు, పిల్లలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ రక్షణ అందించడానికి ఏప్రిల్‌లో స్పందన--తక్షణ రక్షణ బృందాలను ప్రారంభించామని చెప్పారు. పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ, వారు కోల్పోయిన వ్యక్తిని ఎవరూ తిరిగి తీసుకురాలేరని, వారి కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ పూర్తిగా భర్తీ చేయలేరని, అయితే వారి బాధలో వారు ఒంటరివారు కారని, తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ, సమాజం వారికి అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి అధికారి, సిబ్బంది క్రమశిక్షణతో, నిజాయితీతో విధులు నిర్వహించాలని, ప్రజలకు భరోసా కల్పించాలని సూచించారు. ప్రజల భద్రతకు పోలీసులు అండగా నిలవాలని, వారి సంక్షేమానికి, కుటుంబాల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అమరులను గౌరవించడమంటే కేవలం నివాళులు అర్పించడం మాత్రమే కాదని, వారి త్యాగాలను గౌరవించడం, కుటుంబాలకు అండగా నిలవడం కూడా అంతే ప్రాధాన్యమైనవని పేర్కొన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలులోనే అసలు విషయం దాగి ఉందని, సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో పోలీసుల వద్దకు వచ్చే సామాన్యులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, నేరస్థులతో కఠినంగా వ్యవహరించాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

# ఆంధ్ర ప్రభుత్వానికి సుప్రీం షాక్





**ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టిన సుప్రీంకోర్టు**
**దాడులను ఎన్నికల ఆగడాలను నియంత్రిస్తూ తీర్పునిచ్చింది**
**పోటీలో పాల్గొనే అభ్యర్థులను రక్తాలు కారేలా కొట్టించిన కూటమి ప్రభుత్వం**
**ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులను చూసి సభ్య సమాజం సిగ్గుపడుతుంది**
**మరో మణిపూర్ రాష్ట్రాన్ని తలపించిన ఆంధ్రప్రభుత్వం**
**స్వతంత్రంగా నామినేషన్ వేసుకునుటకు సుప్రీం అంగీకారం**
**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దాడులపై భగ్గుమంటున్న ప్రజలు**
**నామినేషన్లు తిరస్కరణ అభ్యర్థుల బాండోవర్లు అప్రజాస్వామికం**
**వైసిపి నేతలపై దాడులకు ఎగబడుతున్న కూటమినేతలు**
**పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న కూటమి ప్రభుత్వం : డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను సుప్రీంకోర్టు ఎండగట్టిందని డాక్టర్ బరిగెల శివ తనదైన శైలిలో స్పందించారు.ప్రజాస్వామ్యానికి కట్టుబడి రాజకీయ ఎన్నికలు జరగాల్సి ఉంటుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు అన్ని పార్టీల నేతలు నామినేషన్స్ వేసుకుంటుండగా కూటమి ప్రభుత్వం పలు జిల్లాల్లో వైసీపీ నేతలను నామినేషన్లు వేయకుండా రోడ్ల పైన పోలీసుల సమక్షంలోనే పట్టపగలే దాడులు చేయిస్తూ నామినేషన్ పత్రాలను చింపేయిస్తూ బయానతి భయంకరంగా బెదిరింపులకు పాల్పడడం దాడులు చేయించడం ప్రజాస్వామ్య విరుద్ధమని తీవ్రంగా మండిపడ్డారు.రాష్ట్రంలో జరుగుతున్న హింసపై వైసిపి అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇతర నేతలతో కలిసి రాష్ట్ర గవర్నర్ కు వినతి పత్రం ఇచ్చినప్పటికీ రాష్ట్రంలో పరిస్థితులు చక్కబడకపోవడంతో నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సిగ్గుతో తలదించుకునే విధంగా ప్రజాస్వామ్యం రక్షించబడే విధంగా సుప్రీంకోర్టు ద్వారా ఉత్తర్వులు మంజూరు చేయించడం ప్రజాస్వామ్య విలువలకు గర్వకారణమన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను చూసి ఒక్కసారిగా అవాక్కైనా సుప్రీంకోర్టు ఎన్నికల కమిషనర్ కు నేరుగా ఆర్డర్ ను మంజూరు చేస్తూ రాష్ట్ర పోలీస్ డిజిపి తక్షణమే స్పందించి వాతావరణాన్ని చక్కపరచాలని హెచ్చరించడం జరిగిందన్నారు.కూటమి ప్రభుత్వం వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా దాడులతో పాటు వాళ్ళ వాహనాలను తగలబెట్టడం ఆర్వో అధికారులచే నామినేషన్లను తిరస్కరించే విధంగా రాజకీయ ఒత్తిడి తేవడం అన్నింటికన్నా మించి నడిరోడ్లపై పోలీసుల సహకారంతో ఇతరులను దాడులు చేయిండం రక్తాలు కారేల కొట్టించడం రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలు పరాకాష్టకు చేరువయ్యాయని వాటిని గమనిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రభుత్వాన్ని భయంకరంగా చిదిరించుకుంటున్నారని గుర్తు చేశారు.అసలు కైతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ చట్టం నడుస్తుందో ఏ న్యాయం నడుస్తుందో ఏ ఎన్నికల చట్టాలు అమల్లో ఉన్నాయో తెలియదు గానీ దేశంలో ఎక్కడ జరిగిన విధంగా పోలీసులను అడ్డం పెట్టుకొని విపరీతంగా కొట్టిస్తూ రాజకీయ ఎన్నికల్లో ఏకపక్షంగా గెలుపొందాలని కక్ష సాధింపులను బలపరచుకోవడం మాత్రం కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం తగదన్నారు.ఒక డిఐజి స్థాయి లాంటి పోలీస్ అధికారి రాష్ట్ర ప్రజలపై అంతటి అక్కసును వెళ్లగట్టడం కూటమి ప్రభుత్వం పోలీస్ అధికారులను ఎంతలా వాడుకుంటుందో అర్థం చేసుకోగలమన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై కనీసం మాట మాత్రం మాట్లాడకపోవడం పైగా వైసిపి హయాంలో ఇలాంటివి జరిగాయని అందుకే ప్రస్తుతం వాటిని పునరావృతం చేస్తూ గతంలో కన్నా ఎక్కువగా దాడులు చేయించి రాజకీయ ఎన్నికల్లో గెలుపొందాలనుకునే అసాంఘిక ఆలోచనలను బలపరచుకోవడం కోసం ఇదంతా చేస్తున్నట్లుగా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారని అన్నారు.రాష్ట్రాన్ని రక్షించడం కోసం పవన్ కళ్యాణ్ లాంటి నేత ముందుకు వచ్చినందుకు మొదట్లో ఆనంద పడిన ఆంధ్ర ప్రజలు ఆంధ్రప్రదేశ్లో కుటుంబ ప్రభుత్వం ఏర్పడ్డాక డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టాక జరుగుతున్న రాజకీయ పరిణామాలను, రాజకీయ దాడులను,గమనిస్తున్న ఆంధ్ర ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎనలేని వ్యతిరేకతను పెంచుకున్నారని గుర్తు చేశారు. 2024లో ఆంధ్రప్రదేశ్ లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వం ఈవీఎంల సహాయంతో గెలిచిందని రాష్ట్రంలో జరిగిన ఎన్నికల విధానంపై అభ్యర్థుల గెలుపుపై కూటమి ప్రభుత్వం ఏర్పాటుపై రాజకీయ విశ్లేషకులు ఎన్నోసార్లు విమర్శలు చేశారని వాటిని ఏమాత్రం పట్టించుకోని ప్రభుత్వం ప్రజలకు చేయాల్సిన సేవలలో అంతరాయాలు సృష్టిస్తూ ప్రజాసేవకు జవాబుదారితనాన్ని పాటించడం లేదన్నారు.

**ప్రజాస్వామ్యాన్ని పతనం చేయడమే లక్ష్యమా.**

**ఎన్నికల సంఘంకు ఎందుకింత వివక్ష......**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పెద్దగా కనిపించడం లేదని పైగా సీఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్,హోమ్ మంత్రి అనిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను రాష్ట్రంలో బలపరుస్తూ ప్రజల మధ్య చిచ్చులు పెడుతూ దాడులను ప్రేరేపిస్తున్నారని వాటి ద్వారా వందలాది క్రైస్తవ సంఘాలను అకారణంగా కూల్చివేస్తున్నారని క్రైస్తవులపై దాడులు చేయిస్తూ మతాలను బలపరుస్తున్నారని హెచ్చరించారు.క్రైస్తవ హిందూ ముస్లిం అంటూ మతాలను ప్రజలను విడగొడుతూ ఒకరి పైకి ఒకరిని రెచ్చగొడుతూ దాడులు చేయిస్తూ ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిపాలనను విధ్వంసంగా మారుస్తున్నారని అన్నారు.రాజకీయ ఎన్నికల ఎత్తుగడలు ప్రజాభివృద్ధిపై ప్రభుత్వ పరిపాలనపై ఆధారపడుతూ ప్రజాస్వామ్య విలువలతో కూడిన ఎన్నికల నిర్వహించడానికి ప్రభుత్వం సన్నద్ధం కావాల్సి ఉంటుండగా రాజకీయ ఎన్నికల నిర్వహణ విద్వాంసాలతో కూడుకొని రక్తాలు కారేలా దాడులు చేయిస్తూ వాహనాలను తగలబెట్టుకొని ప్రభుత్వ వ్యవస్థలను ప్రభుత్వ అధికారులను పోలీసు వ్యవస్థను ఎన్నికల వ్యవస్థను గుప్పిట్లోకి తీసుకొని రాజకీయ ఎన్నికల్లోనికి వెళ్లాలనే ఆలోచన రావడం కూటమి ప్రభుత్వం చేస్తున్న అతిపెద్ద పొరపాటని విమర్శించారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్న విధానాల పట్ల సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు చేయడం కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు లాగా మారిందన్నారు.సుప్రీంకోర్టు స్పందిస్తూ ఈసీకి కీలక ఆదేశాలు జారీ చేయడంతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న హింసపై వచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ తేదీలు పొడిగించాలని దానితోపాటు నామినేషన్ వేస్తున్న అభ్యర్థులకు భద్రత కల్పించాలని ఆదేశించడం రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ తగిలినట్టుగా ఉందన్నారు. ఏ ప్రాంతాల్లోనైతే అలజడులు ఎక్కువై హింస పెరిగిపోయి నామినేషన్లు వేయకుండా అడ్డంకులు ఆటంకాలు సృష్టించబడినయో ఆయా ప్రాంతాల్లో 19 మున్సిపాలిటీలో తిరిగి నామినేషన్ వేసుకోవడానికి అభ్యర్థులకు అవకాశం కల్పిస్తూ అప్పటివరకు నామినేషన్ల అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించ కూడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది అన్నారు.అవకాశాలు కోల్పోయిన అభ్యర్థులకు నామినేషన్లు వేసుకోవడానికి ఈ నెల 23వ తారీకు వరకు తేదీలను పొడిగించి న్యాయం చేయాలని ఉత్తర్వుల పేర్కొన్నట్లు తెలిపారు.కావున నామినేషన్లను అడ్డుకున్నారని అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చింపివేశారని ఎన్నికల అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వైసిపి పిటిషన్ పరిగణలోనికి తీసుకొని సుప్రీంకోర్టు ఎన్నికల కమిషనర్ కు కీలక ఆదేశాలు ఇవ్వడమే కాకుండా రాష్ట్ర డిజిపి తక్షణమే స్పందించి శాంతి భద్రతలను కాపాడాలని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడానికి పోలీసు వ్యవస్థ అన్ని రాజకీయ పార్టీలకు సమాన న్యాయం చేయాలని హెచ్చరిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందంటూ ఉత్తర్వులలో ప్రభుత్వాన్ని ప్రభుత్వ యంత్రాంగాలను పోలీసు వ్యవస్థను ఎన్నికల అధికారులను తీవ్రంగా హెచ్చరించడం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వంపై విపరీతమైన కోపంతో ఉంటుండగా వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా ఈ విధమైన దొడ్డిదారి మార్గంలో భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రతిపక్షాలను నామినేషన్లు వేయకుండా నిలువరిస్తూ అడ్డుపడుతూ వాళ్ళ నామినేషన్లను ఆర్వో అధికారులచే పూర్తిగా నిర్మూలించబడే విధంగా ప్రలోభాలు పెడుతూ కూటమి ప్రభుత్వం వాళ్ళ కక్షలను బలపరుచుకుంటుందన్నారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని ఒక్కడిని చూసి ఇంతలా భయపడుతున్న కుటుంబ ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల పట్ల రానున్న కాలంలో ప్రజలు తీవ్రమైన గుణపాఠం చెప్పబోతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రభుత్వం అధికారంలో ఉండగా ఇంత వీరాంగం సృష్టించి,ఇంతటి హింసను సృష్టించి,ఇంతటి దాడులు చేయించి,అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందో కూటమి ప్రభుత్వం తెలుగు ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర డిజిపి ఎన్నికల అధికారులు ఎన్నికలు శాంతియుత మార్గంలో జరగడానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

# మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి





**కర్ణాటక/మైసూరు, అక్టోబర్ 21(జై భీమ్ న్యూస్)**

కర్ణాటక రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించే మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు మైసూరుకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి, దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జంబూ సవారిని వీక్షించారు. మైసూరు దసరా ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన జంబూ సవారిలో అందంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అంతకుముందు మైసూరు ప్రజల ఆరాధ్య దైవమైన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మైసూరు రాజభవనం వద్ద నిర్వహించిన దసరా వేడుకల్లో పాల్గొన్నారు. జంబూ సవారి ఊరేగింపులో కన్నడ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే జానపద కళాకారులు, సంగీత బృందాలు, నృత్య కళాకారులు, వివిధ సాంస్కృతిక బృందాలు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్ణాటక నాడ హబ్బగా నిర్వహించే మైసూరు దసరా ఉత్సవాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, కళలు, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీషన్‌తో పాటు దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి దసరా వేడుకలను వీక్షించారు. మైసూరు దసరా వైభవాన్ని, సాంస్కృతిక ప్రదర్శనలను ఆయన ఆసక్తిగా తిలకించారు.

# అంతర్జాతీయ వేదికపై యువ పరిశోధకుడి సత్తా!

**తిరుమలాయపల్లి యువకుడు వశపాక అనిల్‌కు ప్రథమ బహుమతి**
**ప్రపంచ జీర్ణకోశ వ్యాధుల సదస్సులో గుర్తింపు**
**క్యాన్సర్ పరిశోధనల్లో కీలకంగా కృషి**
**అనిల్‌కు ప్రముఖుల అభినందనల వెల్లువ**
**గ్రామ యువతకు స్ఫూర్తిగా నిలిచిన విజయం**



**రాయపర్తి(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన యువ పరిశోధకుడు వశపాక అనిల్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. ప్రపంచ జీర్ణకోశ వ్యాధుల సదస్సులో యువ పరిశోధకుల పురస్కారాల విభాగంలోని జీర్ణకోశ పరిశోధనల అంశంలో ప్రథమ బహుమతి సాధించడం పట్ల గ్రామస్థులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పరిశోధకుడిగా కొనసాగుతున్న అనిల్, ఏఐజీ ఆసుపత్రుల పరిశోధనా విభాగమైన ఏషియన్ హెల్త్‌కేర్ ఫౌండేషన్‌తో కలిసి క్యాన్సర్ పరిశోధనల్లో కృషి చేస్తున్నారు. ముఖ్యంగా భారతీయుల్లో పెద్దపేగు, మలాశయ క్యాన్సర్‌కు సంబంధించిన జన్యుపరమైన మార్పులు, వ్యాధి లక్షణాలు, భవిష్యత్తులో చికిత్సకు ఉపయోగపడే అవకాశాలపై ఆయన పరిశోధన సాగుతోంది. గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి అంతర్జాతీయ శాస్త్రీయ వేదికపై ప్రతిభ చాటుకోవడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. అనిల్ మరిన్ని విజయాలు సాధించి వైద్య పరిశోధన రంగంలో దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**అనిల్‌కు ప్రముఖుల అభినందనలు**

వశపాక అనిల్ సాధించిన విజయాన్ని తిరుమలాయపల్లి పోలీస్ పటేల్ కుటుంబానికి చెందిన విజేందర్ రెడ్డి, ఇన్‌స్టా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ నిర్వహణ సంచాలకుడు జినుగు సందీప్ రెడ్డి, జై భీమ్ టీవీ వ్యవస్థాపకులు, చైర్మన్ డా. బరిగెల శివ, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాశం నరోత్తం రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వశపాక ఎల్లయ్య, పారుపల్లి మధుసూదన్ రెడ్డి, శీల మధుసూదన్ రెడ్డి, శీల ఎల్లారెడ్డి, గుడి రామచంద్రారెడ్డి, చిక్కుడు శ్రీనివాస్ తదితరులు అభినందించారు. అనిల్ తల్లిదండ్రులు వశపాక కుమారస్వామి, వినోదలకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. తమ కుమారుడి ప్రతిభతో గ్రామానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రతిభావంతులైన పరిశోధకులు ఎదిగి ప్రపంచ స్థాయిలో రాణించగలరని వశపాక అనిల్ విజయం నిరూపిస్తోందని పలువురు పేర్కొన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేసి వైద్య విజ్ఞాన రంగానికి సేవలందించడంతో పాటు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తిరుమలాయపల్లి నుంచి అంతర్జాతీయ పరిశోధనా వేదిక వరకు సాగిన వశపాక అనిల్ ప్రయాణం గ్రామ యువతకు స్ఫూర్తిదాయకం. ఆయన సాధించిన విజయం గ్రామానికి గర్వకారణంగా నిలిచిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# అంతర్జాతీయ స్థాయిలో మన ఊరి బిడ్డ ప్రతిభ..





**యువ పరిశోధకుడు అనిల్ కుమార్‌కు డా. బరిగెల శివ ఘన సన్మానం**
**తిరుమలయపల్లి యువకుడి పరిశోధనా ప్రతిభకు అభినందనలు..**
**అంబేద్కర్ ఆశయాల పుస్తకాలు అందజేత**

**వరంగల్(జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ పరిశోధనా వేదికపై ప్రతిభ చాటుతూ గ్రామానికి గర్వకారణంగా నిలుస్తున్న యువ పరిశోధకుడు వశపాక అనిల్ కుమార్‌ను జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్, ప్రజాదరణ పార్టీ వ్యవస్థాపకులు డా. బరిగెల శివ ఆయన నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు వశపాక కుమారస్వామి, వినోదను ఆత్మీయంగా అభినందించారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత విశేషాలు, విద్యా ప్రాధాన్యత, సామాజిక సమానత్వం, ఆశయాలను తెలియజేసే ఎంపీ మల్లు రవి రచించిన పుస్తకాలను అనిల్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డా. బరిగెల శివ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల యువతలో అపారమైన ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం, అవకాశాలు లభిస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించగలరని పేర్కొన్నారు. అనిల్ కుమార్ సాధిస్తున్న విజయాలు తిరుమలయపల్లి గ్రామానికే కాకుండా గ్రామీణ యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన విద్యా మార్గంలో నడుస్తూ యువత పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన యువతను గుర్తించి ప్రోత్సహించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అనిల్ కుమార్ విజయాల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం, కృషి ఎంతో ముఖ్యమని పేర్కొంటూ వశపాక కుమారస్వామి, వినోదలను అభినందించారు. అనిల్ కుమార్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తల్లిదండ్రులు వశపాక కుమారస్వామి, వినోద, ఆయన బాబాయిలు వశపాక మల్లయ్య, వశపాక ఎల్లయ్య, వశపాక సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# సొంత పొలంలో ఎండుతున్న వరి పంటను చూసి ఆవేదన చెందిన డా. బరిగెల శివ





**రైతన్న కష్టం కళ్లారా చూస్తేనే అర్థమవుతుంది.. పంట ఎండిపోతుంటే రైతుల బాధ వర్ణనాతీతం**

**వరంగల్(జై భీమ్ న్యూస్)**

తన సొంత పొలంలో నీటి కొరతతో ఎండిపోతున్న వరి పంటను చూసి డా. బరిగెల శివ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో వర్షాలు కురవక, సాగునీరు అందక పంట ఎండిపోతున్న పరిస్థితి తనను కలచివేసిందని పేర్కొన్నారు. పంట సాగు కోసం రైతులు పెట్టుబడులు పెట్టి, అప్పులు చేసి, రాత్రింబవళ్లు కష్టపడుతుంటారని, తీరా పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరతతో పంట దెబ్బతింటే వారి పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందోనని ఆయన ఆవేదన చెందారు. తన సొంత పొలంలోనే ఈ పరిస్థితిని చూసినప్పుడు, ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న ఇతర రైతుల బాధలు ఎలా ఉంటాయో అర్థమవుతోందని పేర్కొన్నారు. రైతు కష్టం తెలిసిన ప్రతి ఒక్కరూ సాగునీటి సమస్యపై స్పందించాలని, పంటలు ఎండిపోకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల శ్రమ వృథా కాకుండా, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. "సొంత పొలంలో పంట ఎండిపోతుంటే కలిగే బాధ మాటల్లో చెప్పలేనిది. మరి అప్పులు చేసి, కుటుంబమంతా కష్టపడి పంట పండించే రైతన్న పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచిస్తేనే గుండె తరుక్కుపోతోంది. రైతు కన్నీరు పెట్టని పరిస్థితులు కల్పించడమే మనందరి బాధ్యత" అని డా. బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు.



# తిరుమలయపల్లిలో దసరా ఉత్సవాలకు ముఖ్య అతిథిగా డా.బరిగెల శివ

**శ్రీ భవాని యూత్ ఆధ్వర్యంలో ఘనంగా దసరా వేడుకలు.. దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన డా. బరిగెల శివ**



**రాయపర్తి(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిరుమలయపల్లి గ్రామంలో శ్రీ భవాని యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాలకు జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్, ప్రజాదరణ పార్టీ వ్యవస్థాపకులు డా. బరిగెల శివ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దుర్గామాతను దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ భవాని యూత్ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఉత్సవాల్లో పాల్గొన్న డా. బరిగెల శివకు యువత, గ్రామస్తులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. గ్రామంలో దసరా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. యువత సామాజిక ఐక్యతకు ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ సంప్రదాయాలను పరిరక్షించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎల్లయ్య, మండల నాయకులు మధుకర్, వంశీ, శ్రీ భవాని యూత్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరులకు ఘన నివాళులు

**విధి నిర్వహణలో 25 మంది పోలీసుల ప్రాణత్యాగం..**
**వారి సేవలు చిరస్మరణీయం : కలెక్టర్ సత్య శారద**





**హనుమకొండ, 21 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

దేశ రక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నిర్మూలన వంటి అంశాల్లో పోలీసుల కృషి అభినందనీయమన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 25 మంది పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం వారు చేసిన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. అమరవీరుల సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు అధికారులు గౌరవాభివందనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, అడిషనల్ డీసీపీలు బాలస్వామి, సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem TV

# డాక్టర్ అనితా రెడ్డికి 'శ్రీ దుర్గాదేవి సేవా పురస్కారం-2026'

**సంస్కృతి పరిరక్షణ, సామాజిక సేవలకు గుర్తింపుగా పురస్కారం**

**హైదరాబాద్, 21 అక్టోబర్ 2016 (జై భీమ్ న్యూస్)**




అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డికి 'శ్రీ దుర్గాదేవి సేవా పురస్కారం--2026' లభించింది. విజయదశమి నవరాత్రులను పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ ఈ అవార్డును అందజేసింది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు ప్రకృతి సంరక్షణపై, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించేందుకు ఆమె చేస్తున్న కృషిని ఫౌండేషన్ గుర్తించింది. అలాగే అనాథలు, దివ్యాంగులు, మహిళలు, వృద్ధులకు అందిస్తున్న నిస్వార్థ సేవలను పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కృషి చేస్తూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు సామాజిక మార్పునకు నాయకత్వం వహించే మహిళలను ప్రోత్సహించడమే ఈ పురస్కారం లక్ష్యమని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్న డాక్టర్ అనితా రెడ్డికి ఈ అవార్డు అందించడం తమ సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. అవార్డులు సమాజం పట్ల బాధ్యతను మరింత పెంచుతాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సమాజహిత కార్యక్రమాలు నిర్వహిస్తూ, అవసరార్థులకు అండగా నిలుస్తానని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మహేష్ మృతి.. ఎమ్మెల్యే నాగరాజు నివాళులు

**బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి.. మనోధైర్యంగా ఉండాలని పరామర్శ**





**వరంగల్, 21 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామానికి చెందిన గుడికందుల మహేష్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరంగల్‌లోని మార్చురీ వద్ద మహేష్ భౌతికకాయాన్ని హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్‌తో కలిసి సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మహేష్ మృతి పున్నేలు గ్రామంలో విషాదాన్ని నింపిందని, కుటుంబ సభ్యుడిని కోల్పోయిన బాధిత కుటుంబానికి ఈ లోటు తీరనిదని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. మహేష్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేబీఎం చైర్మన్ జన్నపురెడ్డి రుగ్విద్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజయ్య, వార్డు సభ్యులు చెన్నూరి రవి, చిన్ని, నాయకులు రాయపురం సాంబయ్య, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

**సంస్మరణ దినోత్సవం సందర్భంగా మడికొండ బ్రదర్స్ ఘన నివాళి**

**పరకాల, 21 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు మడికొండ బ్రదర్స్ ఘన నివాళులర్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవలు, వారి త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తూ, విధి నిర్వహణలో ప్రాణత్యాగానికి వెనుకాడని పోలీసుల ధైర్యసాహసాలు, కర్తవ్యనిష్ఠ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. అమరవీరుల త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అమరవీరుల సేవా స్ఫూర్తిని భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలని, వారి కుటుంబాల త్యాగాలను సమాజం గౌరవించాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు మడికొండ బ్రదర్స్ అశ్రునివాళులు అర్పించారు.





# తెలంగాణకు బీసీ సీఎం.. ఇప్పుడే కాదు

**బీసీ సీఎం కావడానికి గడువు లేదన్న మహేశ్ గౌడ్**
**కాంగ్రెస్‌తోనే బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య**
**2039 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా**
**రేవంత్ పాలనపై టీపీసీసీ చీఫ్ ప్రశంసలు**
**బీఆర్ఎస్‌పై ప్రశ్నలు.. బీజేపీకి భవిష్యత్తు లేదని వ్యాఖ్య**

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్) :**

తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉన్నాయని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాకుండా 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు. బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని మహేశ్ గౌడ్ అన్నారు.




# టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య





**హన్మకొండ, అక్టోబర్ 21(జై భీమ్ న్యూస్)**

రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం ద్వారా అర్హులైన చిన్నారులందరికీ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తిస్థాయిలో టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అప్పయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెల్లంపల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందుతున్నాయా, టీకాల కార్యక్రమం సక్రమంగా నిర్వహిస్తున్నారా అనే అంశాలను పర్యవేక్షించారు. అర్హులైన చిన్నారులందరికీ టీకాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం త్వరలో ప్రారంభించనున్న నూతన నడికూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ అప్పయ్య పరిశీలించారు. వైద్య పరికరాలు, ఇతర అవసరమైన సామగ్రిని ఆరోగ్య కేంద్రానికి తరలించే ప్రక్రియను పరిశీలించి, కేంద్రం ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. నూతన ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వచ్చిన అనంతరం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ అప్పయ్య తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, అందుబాటులో ఉన్న సిబ్బంది సమన్వయంతో ప్రజలకు అవసరమైన వైద్య సేవలను నిరంతరాయంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ టీకాల కార్యక్రమంతో పాటు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని వైద్య సిబ్బందికి ఆయన సూచించారు.

# ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి, విద్యుత్ కొరతకు అవకాశం!

**నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి**
**ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**



**హన్మకొండ , 21 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో నీరు, విద్యుత్ వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అవసరమైన మేరకే నీటిని వినియోగిస్తూ వృథాను అరికట్టాలని, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున భవిష్యత్తులో నీటి లభ్యత, విద్యుత్ సరఫరాపై సవాళ్లు ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ, వాతావరణ మార్పుల నేపథ్యంలో పొదుపు చర్యలు కీలకమని తెలిపారు. అవసరం లేని సమయంలో విద్యుత్ పరికరాలను ఆపివేయాలని, నీటిని వృథా చేయకుండా బాధ్యతాయుతంగా వినియోగించాలని కోరారు. నీరు, విద్యుత్ పొదుపు ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ప్రకృతి వనరుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని పిలుపునిచ్చారు.

# పునరావృతమైన పేరును తొలగించి, మిగతా వివరాలను యథాతథంగా ఉంచాను

**బిర్రు కమల్ హాసన్, బిర్రు మధార్‌లకు ఘన సన్మానం**
**నూతన పదవులతో గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి : కాంగ్రెస్ నాయకులు**

**నెక్కొండ, 21 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

నెక్కొండ మండలం పెద్ద కొర్పోల్ గ్రామానికి చెందిన బిర్రు కమల్ హాసన్ ఎస్సీ సెల్ జిల్లా ప్రచార కార్యదర్శిగా, బిర్రు మధార్ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పెద్ద కొర్పోల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, సోంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ హరీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లౌడియ్య తిరుమల్, క్లస్టర్ ఇన్‌చార్జి ఆవుల శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భాను ప్రకాష్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నూతన పదవులు చేపట్టిన కమల్ హాసన్, మధార్ మరిన్ని ఉన్నత పదవులు పొందాలని, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మట్టే వెంకటయ్య, వార్డు సభ్యురాలు భాదవత్ కాంతి, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెండే రవీందర్, పడాల రవి కుమార్, పడాల రాజ్ కుమార్, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గాజుల రాము, మాజీ సర్పంచ్ కుమారస్వామి, యూత్ అధ్యక్షుడు కొమురన్న, మాజీ ఎంపీటీసీ జమాండ్ల రాములు, అంబాలా శ్రీనివాస్, కన్న శంకర్, పడాల శ్రీనివాస్, పడాల సురేందర్, బండారి లక్ష్మణ్, బైరు యాకయ్య, పడాల వేణు, పడాల సుధాకర్, పడాల సురేష్, బాల్లే రవి, దయ్యాల ప్రభాకర్, చిలువేరి యాకయ్య, గుర్రం జంపాలు, బండారి జంపాలు, మట్టే స్వామి, నాంపెల్లి వీరస్వామి, అంబాలా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# విజయదశమితో ముగిసిన శ్రీ భద్రకాళీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు





### అమ్మవారిని దర్శించుకున్న సుమారు 60 వేల మంది భక్తులు

**వరంగల్, అక్టోబర్ 21(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు విజయదశమితో ఘనంగా ముగిశాయి. విజయదశమి సందర్భంగా ఆలయంలో ఉదయం నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం కలశోద్వాసన, అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం, చక్రతీర్థోత్సవం (చక్రస్నానం), ధ్వజావరోహణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. విజయదశమి రోజున సుమారు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు శమీ పత్రాలను (జమ్మి ఆకులను) పరస్పరం పంచుకున్నారు. విజయదశమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖుల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి ఐపీఎస్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డా. బండా ప్రకాష్, దేవాదాయ శాఖ స్థపతి వల్లినాయగం తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఉభయదాతలుగా రత్న హోటల్ అధినేతలు పింగిళి సంపత్ రెడ్డి--సునీత దంపతులు వ్యవహరించారు. బుధవారం (21-10-2026) మధ్యాహ్నం అమ్మవారికి శతఘటాభిషేకం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 7.30 గంటలకు ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు భగవత్ప్రసాదంగా అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కళ్యాణోత్సవానికి ఉభయదాతలుగా మంచాల శ్రీకాంత్--కవిత దంపతులు, మంచాల నవీన్--స్వప్న దంపతులు, యాదా కిషన్--శోభ దంపతులు, రేగూరి ఆంజనేయులు--సరళ దంపతులు వ్యవహరించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పది రోజుల పాటు అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో శ్రీ భద్రకాళీ భక్తసేవా సమితి నిర్వహించిన ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు భక్తుల ప్రశంసలు అందుకున్నాయి. ఉత్సవాలకు హాజరైన వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తూ భక్తసేవా సమితి విశేష సేవలందించింది. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన అధికారులు, అనధికార ప్రముఖులు, పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధులకు ఆలయ చైర్మన్ డా. బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, కల్లూరి పవన్ కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్ బాబు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్, పేరాల శ్రీనివాసరావు, రమేష్ చంద్ భంగ్, చింతలపణి వాసవి రెడ్డి, మోతుకూరి మయూరి, ఎక్స్అఫిషియో సభ్యులు పార్నంది నర్సింహమూర్తి, కార్యనిర్వహణాధికారి రామల సునీతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం: సీపీ ఎన్. శ్వేత ఐపీఎస్





**హన్మకొండ, అక్టోబర్ 21(జై భీమ్ న్యూస్)**

పోలీసు అమరవీరుల త్యాగాలు దేశ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో పాటు అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు పాల్గొని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ ఎన్. శ్వేత మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి ఏడాది పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 25 మంది పోలీసు అధికారులు, సిబ్బంది అమరులయ్యారని సీపీ తెలిపారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. వారి త్యాగ స్ఫూర్తితో ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో సీపీ శ్వేత ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అమరుల కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు సీపీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, అడిషనల్ డీసీపీలు బాలస్వామి, సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరులకు జోహార్లు.. జోహార్లు!

### విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వీరులకు ఘన నివాళులు

**అమరావతి, 21 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

విధి నిర్వహణలో అంకితభావంతో సేవలందిస్తూ ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్ ఘనంగా నివాళులర్పించారు.

**ప్రజా రక్షణలో పోలీసుల సేవలు అమోఘం**

ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణతో పాటు శాంతిభద్రతల నిర్వహణలో పోలీసులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆయన పేర్కొన్నారు. పగలనక, రాత్రనక, ఎండనక, వాననక నిరంతరం విధులు నిర్వహిస్తూ ప్రజా భద్రతకు భరోసా కల్పిస్తున్న పోలీసుల సేవలను సమాజం ఎప్పటికీ మరువలేదన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసులుగా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బంది సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.

**త్యాగాలకు కన్నీటి నివాళి**

విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని డా. మేడపాటి ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరులైన వీరులందరికీ కన్నీటి భాష్పాంజలితో శ్రద్ధాంజలి, పుష్పాంజలి ఘటిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు.




# పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి తనిఖీ



**వరంగల్, అక్టోబర్ 21(జై భీమ్ న్యూస్)**

ఫోర్ట్ వరంగల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంతో పాటు వివిధ గదులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని గదులను శుభ్రంగా, క్రమపద్ధతిలో నిర్వహించాలని వైద్యాధికారికి సూచించారు. ఆసుపత్రిలోని మందులను క్రమపద్ధతిలో అమర్చడంతో పాటు మందుల నిల్వలను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. గడువు ముగిసిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని, వాటిని ఇతర మందుల నుంచి వేరుగా ఉంచి నిబంధనల ప్రకారం సురక్షితంగా డిస్పోజ్ చేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి ప్రాంగణం, మందుల నిల్వలు, గదుల నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి సూచించారు. ఈ తనిఖీలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ వేద కిరణ్‌తో పాటు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# అనుబంధ సంఘాల బలోపేతంతోనే కాంగ్రెస్ పార్టీ బలం

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ఆత్మకూర్, అక్టోబర్ 21(జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేయడం ద్వారా పార్టీ మరింత పటిష్టంగా మారుతుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే నివాసంలో పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లడంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు యువత ముందుండాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలైన ఎన్ఎస్‌యూఐ, సోషల్ మీడియా కమిటీలను గ్రామ గ్రామాన ఏర్పాటు చేసి వాటిని మరింత బలోపేతం చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు సమన్వయంతో పనిచేసి అనుబంధ సంఘాల కమిటీలను ఏకగ్రీవంగా ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గురువారం నుంచి పరకాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అనుబంధ సంఘాల కమిటీల ఎన్నిక ప్రక్రియను ప్రారంభించి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ సమక్షంలో కమిటీలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సూచించారు. కమిటీల ఏర్పాటులో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు సమిష్టిగా కృషి చేసి సహకరించాలని కోరారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పర్యాటక అభివృద్ధికి పాకాల అభయారణ్యంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి

### పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలి

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, 21 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతంలోని పాకాల అభయారణ్యాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం పరిశీలించారు. అభయారణ్యంలోని పార్కులో పర్యాటకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వారికి కల్పిస్తున్న వసతులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సంబంధిత అటవీ శాఖ అధికారులకు సూచించారు. పాకాల అభయారణ్యంలోని ప్రకృతి అందాలను పరిరక్షిస్తూనే పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అభయారణ్యాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని పోలీసులకు ఘన నివాళి**

**హన్మకొండ, అక్టోబర్ 21(జై భీమ్ న్యూస్)**

దేశ రక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణతో పాటు శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని, ఈ క్రమంలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు దేశానికి గర్వకారణమని పోలీస్ కానిస్టేబుల్ నమిండ్ల కిషోర్ కుమార్ అన్నారు. అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1959లో లడఖ్‌లోని హాట్‌స్ప్రింగ్స్ ప్రాంతంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ ఈ రోజును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉగ్రవాదులు, తీవ్రవాదులు, నేరస్తులను ఎదుర్కొంటూ దేశ భద్రత కోసం, అల్లర్లు, ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల రక్షణ కోసం పోలీసులు ముందుండి పనిచేస్తున్నారని, ప్రాణాలకు ప్రమాదం ఉందని తెలిసినా విధులను ధైర్యంగా నిర్వర్తిస్తున్న పోలీసుల సేవలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఒక పోలీస్ అమరుడైతే ఒక వ్యక్తిని మాత్రమే కుటుంబం కోల్పోదని, కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తిని, భవిష్యత్తుపై ఎన్నో ఆశలను కోల్పోయినట్లవుతుందని అన్నారు. భర్తను కోల్పోయిన భార్యపై పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత పడుతుందని, భార్యను కోల్పోయిన భర్తకు కుటుంబాన్ని, పిల్లలను చూసుకోవడం కష్టతరమవుతుందని తెలిపారు. తండ్రిని కోల్పోయిన పిల్లలకు ఆయన ప్రేమ, ఆప్యాయత, మార్గదర్శకత్వం జీవితాంతం గుర్తుండిపోతాయని, పుట్టినరోజులు, పండుగలు, పాఠశాల కార్యక్రమాలు, పరీక్షల ఫలితాలు, జీవితంలోని ముఖ్యమైన విజయాల సమయంలో తండ్రి లేకపోవడం తీరని లోటుగా మిగులుతుందని అన్నారు. అయితే తమ తండ్రి దేశం కోసం ప్రాణత్యాగం చేశారనే గౌరవం, గర్వం వారికి జీవితంలో ముందుకు సాగేందుకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. వృద్ధ తల్లిదండ్రులకు తమ బిడ్డను కోల్పోవడం వర్ణించలేని దుఃఖమని, కష్టపడి పెంచి ఉన్నత ఆశయాలతో పోలీస్ ఉద్యోగంలోకి పంపిన కుమారుడు లేదా కుమార్తెను కోల్పోవడం వారి జీవితంలో తీరని విషాదాన్ని మిగులుస్తుందని తెలిపారు.

అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అందించే పరిహారం, కుటుంబ పింఛన్, ఉద్యోగ అవకాశాలు, వైద్య సహాయం, పిల్లల విద్యకు అవసరమైన సహాయం సకాలంలో అందించడంతో పాటు ఆర్థిక సహాయానికి మించి మానసిక ధైర్యం, సామాజిక గౌరవం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరుల కుటుంబాలను పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో గుర్తుచేసుకుని పలకరించడం, వారు ఒంటరిగా లేరనే భరోసా కల్పించడం సమాజం బాధ్యత అని అన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అంటే కేవలం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం మాత్రమే కాదని, వారు మన కోసం వదిలి వెళ్లిన కుటుంబాలను మన కుటుంబాలుగా భావించి ఆదుకోవడమే నిజమైన గౌరవమని తెలిపారు.



ఇదే సమయంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, బందోబస్తులు, పండుగలు, ఎన్నికలు, వీఐపీ విధులు, అత్యవసర సంఘటనలు, నేరాల దర్యాప్తు వంటి కారణాలతో నిర్ణీత సమయానికి విధులు ముగించలేక ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తోందన్నారు. తగిన విశ్రాంతి లేకుండా విధులు నిర్వహించడం వల్ల శారీరక అలసట, మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని చెప్పారు. పిల్లల పుట్టినరోజులు, పాఠశాల కార్యక్రమాలు, పండుగలు, కుటుంబ వేడుకలకు హాజరుకాలేకపోవడం, అనారోగ్యంతో ఉన్న తల్లిదండ్రులు, భార్య లేదా పిల్లల వద్ద ఉండలేకపోవడం వంటి పరిస్థితులు పోలీసు కుటుంబాలకు బాధను కలిగిస్తున్నాయని తెలిపారు. నేరస్తులను ఎదుర్కొనడం, అల్లర్లను నియంత్రించడం, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయడం వంటి సందర్భాల్లో పోలీసులు తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని, విధులకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా తిరిగి వస్తాడా లేదా అనే ఆందోళన అనేక పోలీసు కుటుంబాల్లో ఉంటుందని అన్నారు. హత్యలు, ప్రమాదాలు, కుటుంబ హింస, చిన్నారులపై నేరాలు వంటి హృదయవిదారక సంఘటనలను తరచుగా ఎదుర్కొనే పోలీసులకు మానసిక ఆరోగ్య సహాయం, తగిన విశ్రాంతి, ఆరోగ్య పరిరక్షణ చర్యలు అవసరమని తెలిపారు. ఎండ, వర్షం, రాత్రి వేళల్లో విధులు నిర్వహించడం, సమయానికి భోజనం చేయలేకపోవడం వంటి కారణాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, తగిన నిద్ర, సమయానికి భోజనం, శారీరక వ్యాయామం అవసరమని అన్నారు. సిబ్బంది కొరత, బదిలీలు, సెలవుల సమస్యలను తగ్గించేందుకు సముచిత సిబ్బంది కేటాయింపు, న్యాయమైన బదిలీ విధానం, సెలవులు, విశ్రాంతి సమయాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు కూడా మనలాంటి మనుషులేనని, వారికి కూడా అలసట, బాధలు, కుటుంబంపై ప్రేమ, పిల్లలపై ఆశలు ఉంటాయని, అయినప్పటికీ ప్రజల భద్రత కోసం తమ వ్యక్తిగత ఆనందాలను సైతం త్యాగం చేస్తున్నారని కిషోర్ కుమార్ పేర్కొన్నారు. సమాజానికి రక్షణ కవచంగా నిలిచే పోలీసు వ్యవస్థను బలంగా ఉంచాలంటే ఆ రక్షణ కవచం వెనుక ఉన్న పోలీసుల ఆరోగ్యం, కుటుంబం, ఆత్మగౌరవాన్ని కూడా కాపాడాలని, పోలీసుల సంక్షేమమే సమర్థవంతమైన పోలీస్ వ్యవస్థకు పునాది అని అన్నారు. ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ రక్షణలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, వారి ధైర్యం, క్రమశిక్షణ, దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.

# సెలవులు సమాప్తం.. స్కూల్ బల్లలు సిద్ధం

**విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎంతో అవసరం**

**డా. ఎం. సుభాష్ చంద్ర, ఎం.బి.బి.ఎస్.**



**అమరావతి, అక్టోబర్ 21(జై భీమ్ న్యూస్)**

దసరా సెలవులు ముగియడంతో విద్యార్థులు తిరిగి పాఠశాలలు, కళాశాలల బాట పట్టారు. యూనిఫాం ధరించి బ్యాగులు భుజాన వేసుకుని విద్యార్థులు స్కూల్‌కు వెళ్లడం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో పిల్లల విద్యతో పాటు వారి ఆరోగ్యం, ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని డా. ఎం. సుభాష్ చంద్ర సూచించారు. కొన్ని దశాబ్దాల క్రితం పిల్లలు, యువకులు వ్యవసాయ పనుల్లో కుటుంబాలకు తోడుగా ఉండేవారని, పారిశ్రామిక రంగం విస్తరించడంతో ఉపాధి అవకాశాలు మారాయని, ప్రస్తుతం విద్యకు అత్యంత ప్రాధాన్యత పెరిగిందన్నారు. తమ పిల్లలకు మంచి విద్య అందించేందుకు తల్లిదండ్రులు వేలాది, లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఫీజులు చెల్లించడం, పుస్తకాలు కొనివ్వడంతో తల్లిదండ్రుల బాధ్యత పూర్తికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం సమాజంలో డ్రగ్స్ వినియోగం ఆందోళనకరంగా మారుతోందని, చిన్న వయసులోనే కొందరు విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. పిల్లలను లక్ష్యంగా చేసుకుని కొన్ని ముఠాలు మాదకద్రవ్యాల వైపు ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయని అన్నారు. అందువల్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి తమ పిల్లల కదలికలు, స్నేహితులు, అలవాట్లు, సెల్‌ఫోన్ వినియోగాన్ని గమనిస్తూ ఉండాలని సూచించారు. పిల్లలు, యువత ఇతరులు చెప్పే మాటలను త్వరగా నమ్మే అవకాశం ఉంటుందని, అదే సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలను పట్టించుకోకపోవడం కూడా కనిపిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను తెలుసుకోవాలని, అవసరమైనప్పుడు కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు, సంగీతం, కళలు, కరాటే వంటి ఇతర రంగాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని డా. సుభాష్ చంద్ర అన్నారు. క్రీడలు పిల్లలకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. పిల్లల ఆసక్తులు, ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించాలని, కేవలం పుస్తకాల చదువే జీవితంలో విజయానికి ఏకైక మార్గం కాదని అన్నారు. క్రీడలు, సంగీతం, కళలు, వివిధ నైపుణ్యాల ద్వారా కూడా ఎంతోమంది ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తుచేశారు. పిల్లలపై ఒత్తిడి, వేధింపులు లేకుండా వారి ఆసక్తులను తెలుసుకుని ప్రోత్సహించాలని కోరారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులతో తల్లిదండ్రులు నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని, స్కూల్ బస్సులో పిల్లలను పంపించే సమయంలో భద్రతా చర్యలను పాటించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, మానసిక స్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపారు. పుస్తకాల జ్ఞానంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, సింగిల్ పేరెంట్ కుటుంబాలకు చెందిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని డా. సుభాష్ చంద్ర పేర్కొన్నారు. కొంతమంది పిల్లలకు తగిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం లభించకపోవడంతో వారు వెనుకబడే అవకాశం ఉందని తెలిపారు. అలాంటి విద్యార్థులను పాఠశాల యాజమాన్యాలు గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. పిల్లలను చదివించడం మాత్రమే కాదు.. వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అందరి బాధ్యత అని డా. ఎం. సుభాష్ చంద్ర పేర్కొన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం.. కానిస్టేబుల్ సౌజన్య మెట్టుపల్లి ఘన నివాళి



**హన్మకొండ, అక్టోబర్ 21(జై భీమ్ న్యూస్)**

దేశ రక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణతో పాటు శాంతిభద్రతలను కాపాడే క్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్మారక చిహ్నాలను పుష్పాలతో అలంకరించి నివాళులు అర్పించారు. కానిస్టేబుల్ సౌజన్య మెట్టుపల్లి పోలీస్ అమరవీరులకు పుష్పాంజలి ఘటించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వర్తిస్తూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశం, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను గౌరవించడం, వారికి అండగా నిలవడం సమాజ బాధ్యత అని పేర్కొంటూ పోలీస్ అమరవీరుల త్యాగాలు దేశానికి గర్వకారణమని, వారి సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కానిస్టేబుల్ సౌజన్య మెట్టుపల్లి తెలిపారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 25 మంది పోలీసులకు ఘన నివాళులు**

**వరంగల్, 21 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో పాటు అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొని నివాళులర్పించారు.

**విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు మరువలేనివి**

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల ధైర్యసాహసాలు, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నిర్మూలన వంటి అంశాల్లో పోలీసుల సేవలు కీలకమని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

**వరంగల్ కమిషనరేట్ పరిధిలో 25 మంది అమరులు**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు విధి నిర్వహణలో 25 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని కమిషనర్ తెలిపారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారి సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. వారి త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని సూచించారు.

**అమరుల కుటుంబాలకు అండగా పోలీస్ శాఖ**

అమరవీరుల కుటుంబ సభ్యులతో కమిషనర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అమరుల కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, వారి సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, అడిషనల్ డీసీపీలు బాలస్వామి, సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నీటిని ఆదా చేద్దాం.. భవిష్యత్ తరాలకు భద్రత కల్పిద్దాం

**8 నెలలు.. 240 రోజుల పాటు నీటి సంరక్షణపై అప్రమత్తత అవసరం**

**అనిల్ కాందారి జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ మీడియా కో-ఆర్డినేటర్ (హెచ్)**

**హైదరాబాద్, అక్టోబర్ 21(జై భీమ్ న్యూస్)**




నీరు లేకుండా జీవనం సాధ్యం కాదని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించడం ద్వారానే భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించగలమని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ మీడియా కో-ఆర్డినేటర్ (హెచ్), స్టేట్ క్రైమ్ బ్యూరో అనిల్ కాందారి అన్నారు. అక్టోబర్ 2026 నుంచి మే 2027 వరకు సుమారు 8 నెలలు.. 240 రోజుల పాటు నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరిస్తూ రూపొందించిన అవగాహన సందేశాన్ని ప్రజలకు అందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షపాతం తగ్గడం, భూగర్భ జలాలు క్రమంగా పడిపోవడం, చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల్లో నీటి నిల్వలు తగ్గడం వంటి కారణాలతో భవిష్యత్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఇప్పటి నుంచే నీటి సంరక్షణను తమ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా అవసరమైనంత మేరకే వినియోగిస్తే భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సమస్యలను కొంతవరకు నివారించవచ్చని తెలిపారు. ఇంటికి అతిథులు వచ్చినప్పుడు అవసరమైనంత మేరకే తాగునీటిని అందించాలని, స్నానం చేసేటప్పుడు షవర్‌కు బదులుగా ఒక బకెట్ నీటిని వినియోగించడం వంటి చిన్నచిన్న చర్యలను ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. అలాగే ఆర్ఓ యంత్రాల నుంచి వెలువడే వృథా నీటిని పారబోసకుండా ఇంటి శుభ్రత, మొక్కలకు నీరు పోయడం వంటి ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. పళ్లు తోముకునే సమయంలో ట్యాప్‌ను నిరంతరం తెరిచి ఉంచకుండా అవసరమైనప్పుడు మాత్రమే నీటిని వినియోగించాలని, వాహనాలను కడిగేటప్పుడు పైపుతో అధికంగా నీటిని వృథా చేయకుండా తడి గుడ్డతో శుభ్రం చేయడం వంటి పద్ధతులను పాటించాలని కోరారు. దీంతో రోజువారీ జీవితంలోనే పెద్ద మొత్తంలో నీటిని పొదుపు చేయవచ్చన్నారు. అదేవిధంగా కూరగాయలు, బియ్యం తదితరాలను కడిగిన నీటిని మొక్కలకు వినియోగించడం ద్వారా నీటిని తిరిగి ఉపయోగించుకోవచ్చన్నారు. ఇళ్లలో, కార్యాలయాల్లో లేదా పరిసరాల్లో నీటి పైపులు, కుళాయిల నుంచి లీకేజీలు ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేయించాలని సూచించారు. చిన్న లీకేజీని నిర్లక్ష్యం చేసినా రోజులు గడిచే కొద్దీ పెద్ద మొత్తంలో నీరు వృథా అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటిని వినియోగించేటప్పుడు అవసరానికి మించి ఉపయోగించకుండా "ఎంత అవసరమో అంతే నీరు" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని అనిల్ కాందారి పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో నీటి పొదుపు చర్యలు ప్రారంభిస్తే సమాజ స్థాయిలో భారీగా నీటిని సంరక్షించవచ్చని తెలిపారు. నీటి సంరక్షణ అనేది ప్రభుత్వం లేదా కొన్ని సంస్థల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం మనం ఆదా చేసే ప్రతి నీటి చుక్క భవిష్యత్ తరాలకు ఎంతో విలువైనదిగా మారుతుందని పేర్కొన్నారు. "ఈరోజు ప్రతి నీటి చుక్కను ఆదా చేసుకుంటేనే రేపటి నీటి అవసరాలను తీర్చుకోగలం. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగిద్దాం.. నీటి వనరులను కాపాడుకుందాం.. భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పిద్దాం" అని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ మీడియా కో-ఆర్డినేటర్ (హెచ్), స్టేట్ క్రైమ్ బ్యూరో అనిల్ కాందారి అన్నారు.

# నమ్మకం లేకపోతే ఏ బంధం నిలవదు..!

వివాహ జీవితం సుఖంగా సాగాలంటే ప్రేమ, గౌరవం, నమ్మకం, క్షమ, సానుభూతి వంటి విలువలతో నిండిన అనుబంధం కావాలి. ఇందుకు సద్గురు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ విలువలు జీవిత భాగస్వాముల మధ్య బంధాన్ని బలపరచడమే కాకుండా.. జీవితాన్ని సంతోషంగా జీవించడానికి ఉపయోగపడతాయి. వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయ సంబంధం కాదు. సద్గురు ఏం చెబుతున్నారో తెలుసా..? వివాహం అనేది మన జీవితంలో మనకు తోడుగా ఉండే వ్యక్తిని ఎంచుకోవడమే. శారీరక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పూరించగల వ్యక్తి జీవిత భాగస్వామిగా ఉండాలి. ఈ బంధం నిశ్చలంగా నిలవాలంటే దానికి శ్రద్ధ అవసరం. ఏ బంధమైనా రోజురోజుకూ మారుతూ ఉంటుంది. మనం నిర్లక్ష్యం చేస్తే దూరమవుతుంది. కాబట్టి మన జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి. ఒక మంచి వివాహ బంధానికి ముఖ్యమైన అంశం సంభాషణ. మనసులో ఉన్న విషయాలను బహిరంగంగా చెప్పుకోవడం ద్వారా భావోద్వేగాలు సమతుల్యతలో ఉంటాయి. ఇది ఇద్దరినీ దగ్గర చేస్తుంది. అలాగే ఒకరినొకరు గౌరవించడం కూడా ఎంతో అవసరం. వివాహం వల్ల మన వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సిన పని లేదు. ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయాలు ఉంటాయి. అవి భిన్నంగా ఉన్నా.. గౌరవించాలి. ఆ గౌరవం బంధాన్ని నిలబెట్టే శక్తిగా ఉంటుంది.ఇక నమ్మకం గురించి చెప్పాలంటే.. అది లేకుండా ఎలాంటి సంబంధం నిలవదు. భర్తా భార్యల మధ్య పరస్పర నమ్మకం పెరిగేలా మాట్లాడుకోవాలి. ఒకరి నమ్మకాన్ని మరొకరు దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి. నమ్మకమే బంధాన్ని బలంగా ఉంచుతుంది. వివాహం అనగా ఒకరి ప్రపంచంలో మరొకరిని కలిపేసుకోవడం కాదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉండాలి. కొన్ని విషయాల్లో స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా బంధం మరింత ఆరోగ్యంగా మారుతుంది. మానవ సంబంధాల్లో మనుషుల మధ్య అంచనాలు, అబద్ధాలు, అపార్థాలు సాధారణం. అప్పుడు క్షమించగలగడం ఎంతో అవసరం. చిన్నచిన్న సమస్యల్ని పట్టుకొని బంధాన్ని బలహీనంగా మార్చుకోవద్దు. వ్యక్తిగత లక్షణాలను అంగీకరించగలగడం ద్వారా మన



హృదయంలో దయ, ప్రేమ పెరుగుతుంది. మన భాగస్వామిలో ఉన్న అసంపూర్ణతలను అంగీకరించగలగడం ద్వారా జీవితం మరింత సులభంగా సాగుతుంది. జీవిత భాగస్వామి చేసిన పనుల్ని బాధ్యతగా కాకుండా ప్రేమతో చూసుకోవాలి. మనకు చేయబడ్డ సహాయానికి కృతజ్ఞత చూపడం ద్వారా బంధం బలపడుతుంది. భార్యా భర్తలు ఒకే ఇంట్లో ఉన్నా.. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు కలిసి గడపడం అవసరం. కలిసి విహారయాత్రలు, భోజనాలు, లేదా మంచి సమయాన్ని గడపడం ద్వారా ప్రేమ మరింత పెరుగుతుంది. ఈ ప్రయాణంలో నవ్వు ఎంతో కీలకమైనది. ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకోవడం వల్ల మధ్యలో ఉండే ఒత్తిడులు పోతాయి. ఈ విధంగా సాన్నిహిత్యం పెరుగుతుంది. సద్గురు చెప్పిన ఈ సూచనలు వివాహ బంధాన్ని ప్రేమతో, శాంతితో నింపడానికి చాలా ఉపయోగపడతాయి. ఈ బంధం సాధారణంగా ఉండకూడదంటే, ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునే మనసుతో, పరస్పర గౌరవంతో, క్షమించగల స్వభావంతో జీవించాలి. ఇలాంటి విలువలు ఉన్నప్పుడు మాత్రమే ఈ అనుబంధం బలంగా మారుతుంది.

## అరటి ఆకులో భోజనం దీని వెనుక అసలు కారణం ఇదే

మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు ప్రతి పండగ, వేడుకలో అరటి ఆకుల్లో భోజనం చేయడం కనిపిస్తుంది. పురాతన కాలం నుంచి అరటి ఆకులను వివిధ ఆచారాలు, వేడుకలు, రోజువారీ ఆహారంలో మనోళ్లు ఉపయోగిస్తున్నారు. మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. ఆకులు కడగడం నుంచి చివరికి తినడం, ఆకులు మడతపెట్టడం వరకు కొన్ని ఆచారాలు ఉన్నాయి. తినడానికి ముందు అరటి ఆకుపై నీళ్లు చల్లడం శతాబ్దాల నాటి ఆచారం. దీనికి వివిధ కారణాలు ఉన్నాయి. అరటి ఆకులు సహజంగా కీటకాలు, సూక్ష్మజీవులను కలిగి ఉంటాయి. నీటితో చల్లడం, శుభ్రపరచడం వల్ల ఆకులపై ఉన్న కీటకాలు, సూక్ష్మజీవులు చనిపోతాయి. ఆకులపై దుమ్ము, ధూళిని తొలగించి శుభ్రంగా ఉంచడానికి కూడా ఇలా చేస్తారు. అంతేకాకుండా నీటిని చల్లడం వల్ల ఆకులు గట్టిపడతాయి. ఇలా చేయడం వల్ల తినేటప్పుడు ఆకులు చిరిగిపోవడం వంటి సమస్యలు ఉండవు. అంతేకాకుండా అరటి ఆకుపై నీరు చల్లడం చాలా పవిత్రమైన కార్యమని కూడా నమ్ముతారు. అరటి ఆకులో తిన్న తర్వాత దానిని లోపలికి మడతపెడతారు. అలా చేయడం ఆహారాన్ని తయారు చేసి వడ్డించిన వారికి గౌరవం చూపించే మార్గంగా పరిగణిస్తారు. కొన్నిసార్లు ఆహార అవశేషాలు ఆకు లోపలి భాగంలో ఉంటాయి. అందువల్ల ఆకును బయటి నుండి లోపలికి మడవటం వల్ల అవి జారి పోకుండా ఉంటాయి. అలాగే ఆకును లోపలికి మడతపెట్టడం వల్ల సూర్యరశ్మి దానిలోకి ప్రవేశించకుండా నిరోధిస్తుంది. దీనివల్ల అందులోని ఆహారం చెడిపోకుండా ఉంటుంది.



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే

శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ



అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?



కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

జై భీమ్ POWER OF PEOPLE

# 2027 మార్చి 5న 'ఎల్లమ్మ' విడుదల

**దేవిశ్రీ ప్రసాద్ కథానాయకుడిగా అరంగేట్రం**
**దర్శకుడిగా వేణు యెల్దండి**
**దిల్ రాజు సమర్పణలో చిత్రం**
**సాంస్కృతిక సంప్రదాయాల నేపథ్యంలో కథ**
**ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్త విడుదల**

రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఎల్లమ్మ' విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. జాతీయ అవార్డు గ్రహీత, 'బలగం' చిత్రంతో విమర్శకుల ప్రశంసలతో పాటు వాణిజ్య విజయాన్ని అందుకున్న వేణు యెల్దండి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు సమర్పణలో, శిరీష్ నిర్మాణంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందుతోంది. సాంస్కృతిక సంప్రదాయాల నేపథ్యంలో భావోద్వేగాలతో కూడిన కథగా 'ఎల్లమ్మ'ను తీర్చిదిద్దుతున్నారు. దసరా పర్వదినం సందర్భంగా ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఇన్నాళ్లూ ప్రముఖ సంగీత దర్శకుడిగా ప్రేక్షకులను అలరించిన దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాతో నటుడిగా అరంగేట్రం చేయడమే కాకుండా సంగీతాన్ని కూడా అందిస్తున్నారు. సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన ఆయన కథానాయకుడిగా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి పెరిగింది. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఆయన 'పర్షి' పాత్రలో కనిపించారు. దేవిశ్రీ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది. ప్రకటించిన విడుదల తేదీకి అనుగుణంగా చిత్రబృందం పనులు నిర్వహిస్తోంది. దర్శకుడు వేణు యెల్దండి సాంస్కృతిక సంప్రదాయాలు, భావోద్వేగాలను కథనంలో మేళవిస్తూ సినిమాను ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్నారు. 'ఎల్లమ్మ' 2027 మార్చి 5న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. విభిన్న కథాంశం, వేణు యెల్దండి దర్శకత్వం, దేవిశ్రీ ప్రసాద్ నటుడిగా అరంగేట్రం చేయడం ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్రంలో దేవిశ్రీ ప్రసాద్ కథానాయకుడిగా నటిస్తున్నారు.



# అక్టోబర్ 30న 'ఆదర్శ కుటుంబం'

**వెంకటేష్-త్రివిక్రమ్ కలయికలో చిత్రం**
**కుటుంబ అనుబంధాలు, వినోదానికి ప్రాధాన్యం**
**టీజర్, పాటలకు ప్రేక్షకుల స్పందన**
**శ్రీనిధి శెట్టి కథానాయికగా నటన**
**దీపావళికి ముందు థియేటర్లలోకి**

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం. 47' అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు, వినోదం, హాస్యం, యాక్షన్ అంశాల కలయికతో అన్ని వయసుల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దీపావళి పండుగకు ముందు థియేటర్లలోకి వస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు పండుగ వినోదాన్ని అందించనుంది. దాదాపు 20 ఏళ్ల తర్వాత వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో సినిమా వస్తుండటంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటివరకు విడుదలైన రెండు పాటలు, టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. మధ్యతరగతి కుటుంబ జీవితంలోని సహజ సంఘటనలు, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు, చమత్కారమైన సంభాషణలు, హాస్యం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు సినిమాలో ప్రధానంగా ఉండనున్నట్లు టీజర్ సంకేతాలిచ్చింది. కుటుంబ ప్రేక్షకులకు అనుసంధానమయ్యే కథాంశంతో అన్ని తరాల వారినీ ఆకట్టుకునే సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం. 47' రూపొందుతోంది. పాటలు, టీజర్‌కు లభిస్తున్న స్పందనతో పాటు వెంకటేష్-త్రివిక్రమ్ కాంబినేషన్‌పై ఉన్న ఆసక్తి సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్, యువినా, రాజ్ ప్రజ్వల్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, ఉదయ్‌బీర్ సంధు, వెన్నెల కిషోర్, రఘుబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, శ్రీమతి మమత సమర్పిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రవి కె. చంద్రన్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏ.ఎస్. ప్రకాశ్ కళా దర్శకత్వం వహిస్తుండగా, తమన్ ఎస్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. కెవిన్ కుమార్ ఫైట్స్‌ను రూపొందించారు. కుటుంబ బంధాలు, వినోదం, భావోద్వేగాలు, యాక్షన్‌తో కూడిన ఈ చిత్రం అక్టోబర్ 30న విడుదలై థియేటర్లలో పండుగ సందడి చేయనుంది.




## 'ఓం' మూవీ నుంచి రిలీజైన సెకండ్ సాంగ్‌కు సూపర్బ్ రెస్పాన్స్

వెర్సటైల్ స్టార్ ధనుష్ హీరోగా, రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఓం ? చాప్టర్ 1: ఉదిరం' సినిమా నుంచి విడుదలైన రెండో పాట 'వీశా వీర'కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో విడుదలైన ఈ పాట సంగీత ప్రియులను ఆకట్టుకుంటూ, సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. హీరో పవర్, పరాక్రమం, గంభీరమైన వ్యక్తిత్వం, వీరోచిత విన్యాసాలను ఆవిష్కరిస్తూ రూపొందించిన ఈ పాట అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఉత్సాహభరితమైన ప్రదర్శన, హీరో పాత్రను శక్తిమంతంగా చూపించిన తీరు సినిమాపై క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. ఈ పాటకు సాయి అభ్యంకర్ సంగీతం అందించడంతో పాటు టిప్పుతో కలిసి ఆలపించారు. తెలుగులో సాయి అభ్యంకర్, రితేష్ జి రావ్.. హిందీలో సాయి అభ్యంకర్, రితేష్ జి రావ్, పాటను పాడారు. అలాగే తమిళంలో అరుణ్ శ్రీనివాసన్.. తెలుగులో కాసర్లశ్యామ్.. హిందీలో కుమార్ సాహిత్యాన్ని అదించారు. ఉత్సాహభరితమైన సంగీతం, గంభీరమైన గాత్రం ఈ పాటకు మళ్లీ మళ్లీ వినేలా చేస్తున్నాయి. తమిళంలో 'వీశా వీరా' పేరుతో విడుదలైన ఈ పాటను తెలుగు, హిందీ భాషల్లో 'వీరా వీరా' పేరుతో విడుదల చేశారు. ఆర్ టేక్ స్టూడియోస్ బ్యానర్‌పై శ్రద్ధా అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వండర్‌బార్ ఫిల్మ్స్‌పై ధనుష్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ధనుష్, రాజ్‌కుమార్ పెరియసామి కలయికలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే హ్యూజ్ ఎక్స్‌పెక్టేషన్స్ క్రియేట్ అయ్యాయి. పాన్ ఇండియా స్థాయిలో భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ధనుష్ హీరోగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా నుంచి వస్తోన్న ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తొలుత ధనుష్ పాత్రను పరిచయం చేస్తూ విడుదల చేసిన 'ఓం ఫస్ట్ స్ట్రైక్' వీడియో.. తర్వాత బర్మా కార్తికేయన్‌గా మమ్ముట్టిని పరిచయం చేసిన వీడియో సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ సాంగ్‌కు చాలా స్పందన లభించగా, తాజాగా విడుదలైన రెండో పాట కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ దూసుకెళ్తోంది. సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్‌డేట్ అంచనాలను పెంచుతుండటంతో, వెండితెరపై ధనుష్, మమ్ముట్టి కలయికను చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తోన్న ఈ చిత్రానికి కె. ఎళిల్ అరసు సినిమాటోగ్రాఫర్‌గా, ఆర్. కలైవానన్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎ.పన్నీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తుండగా, యానిక్ బెన్, కెచా ఖంపక్డీ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. భారీ అంచనాల మధ్య 'ఓం ? చాప్టర్ 1: ఉదిరం' చిత్రం నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున రిలీజ్‌కు సిద్ధమవుతోంది.